నియామక తేదీ నుంచే సీనియారిటీ లెక్కించండి

ప్రభుత్వానికి టీటీఏ నేతల విజ్ఞప్తి

హైదరాబాద్, జూన్ 14 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో 2000, 2001, 2002 సంవత్సరాలలో విడుదలైన డీఎస్సీ ద్వారా నియమితులైన వారికి, నియామక తేదీ నుంచే సీనియారిటీని లెక్కించాలని ట్రైబుల్ టీచర్స్ అసోసియేషన్ (టీటీఏ) నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ విషయమై హైకోర్టు ఆదేశాలను అమలు చేయాలని కోరారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో సంఘం జనరల్ సెక్రటరీ వీ శ్రీను పవార్, నేత హరికిషన్ చౌహాన్ మాట్లాడుతూ.. డీఎస్సీల ద్వారా ఎంపికైన ట్రైబల్ టీచర్లకు సెలవు రోజులలో కూడా 2005 వరకు శిక్షణ ఇచ్చారని, దాని ప్రకారం ఉద్యోగాలలో నియమించిన నాటి నుంచే సీనియారిటీని వర్తింపజేయాలని విజ్ఞప్తి చేశారు. ఎస్జీటీ, దివ్యాంగులకు ఎలాంటి ఇతర బీఈడీ, టీటీసీ, టెట్ వంటి అర్హతలు లేకుండానే అప్పటి ప్రభుత్వం ఉపాధ్యాయ నియామకాలు చేపట్టిందని గుర్తుచేశారు. ఈ టీచర్లకు ప్రస్తుతం చేపట్టే బదిలీలు, పదోన్నతులను కల్పించడం లేదని, అందరితోపాటు వీరికి కూడా అవకాశం కల్పించాలని కోరారు.

బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలి

బీసీ కుల సంఘాల ఐక్యవేదిక డిమాండ్

హైదరాబాద్, జూన్14 (నమస్తే తెలంగాణ): కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలన్నీ కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలుచేయాలని, సమగ్ర కులగణన చేసి, స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాంయాదవ్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధనకు బీసీ కులసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఇందిరాపార్కు వద్ద శనివారం ఉదయం 11గంటలకు మహాధర్నా నిర్వహించనున్నామని వెల్లడించారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్ తదితరులు హాజరుకానున్నారని, బీసీ మేధావులు, యువకులు భారీగా తరలివచ్చి ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

సెర్ప్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించండి

సీఎం రేవంత్‌కు ఉద్యోగ సంఘ నాయకుల వినతి

హైదరాబాద్, జూన్ 14 (నమస్తే తెలంగాణ) : గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఉద్యోగులకు మరో రెండు క్యాడర్స్ పెంచుతూ ఉత్తర్వులు జారీచేయాలని కోరుతూ ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డిని శుక్రవారం ఆ సంఘ నాయకులు కలిసి వినతిపత్రం సమర్పించారు. ప్రతి నెలా ఒకటో తేదీన వేతనాలు అందే విధంగా చర్యలు తీసుకోవాలని, వ్యక్తిగతంగా నియామకపత్రాలను అందించాలని విజ్ఞప్తి చేశారు. సీఎంను కలిసిన వారిలో సుదర్శన్, వెంకట్, నర్సింహులు, సత్యం ఉన్నారు.

స్కాలర్‌షిప్ అందజేస్తున్న ఏడీజీ అభిలాషబిస్ట్

మరణించిన పోలీసుల పిల్లలకు స్కాలర్‌షిప్‌లు

హైదరాబాద్, జూన్ 14 (నమస్తే తెలంగాణ) : మరణించిన పోలీస్ సిబ్బంది పిల్లలకు 'పరివర్తన' పేరిట హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు స్కాలర్‌షిప్‌లు అందించడం అభినందనీయమని పోలీసు వెల్ఫేర్ అండ్ స్పోర్ట్స్ డీజీ (ఇన్‌చార్జి), పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్ట్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్ డీజీపీ కార్యాలయంలో చనిపోయిన పోలీస్ సిబ్బంది పిల్లల్లో 58 మందికి స్కాలర్‌షిప్‌ల కింద రూ.14.87లక్షల చెక్కును ఆమె అందజేశారు. మూడేండ్లుగా 151 మందికి పరివర్తన్ స్కాలర్‌షిప్‌లను హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు అందజేస్తున్నదని తెలిపారు. ఇప్పటివరకు ప్రమాదవశాత్తు మరణించిన హోంగార్డుల కుటుంబాలకు రూ.3.75 కోట్లను అందజేసిందని వివరించారు. హెచ్‌డీఎఫ్‌సీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ విశాల్ భాటియా, డిప్యూటీ వైస్ ప్రెసిడెంట్ సత్యనారాయణ రావు, వెల్ఫేర్ లైజన్ ఆఫీసర్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

డీఎస్‌లుగా పదోన్నతి

హైదరాబాద్, జూన్ 14 (నమస్తే తెలంగాణ): వివిధ శాఖల్లో ఆరుగురు అసిస్టెంట్ డైరెక్టర్లకు డిప్యూటీ సెక్రటరీలుగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. శోభన్‌బాబు, కల్యాణికి పురపాలకశాఖ, రాజేంద్రప్రసాద్‌కు విద్యాశాఖ, లక్ష్మీబాయికి గిరిజన, సంక్షేమశాఖ, సత్యనారాయణకు మహిళాశిశుసంక్షేమశాఖ, శ్రీనివాస్‌కు రవాణా శాఖలో పోస్టింగులు ఇచ్చింది.

స్థానిక ఎన్నికలు ఇప్పట్లో లేనట్టేనా?

- ఉలుకూపలుకూలేని రాష్ట్ర ప్రభుత్వం
- హైకోర్టులో జూలై 2న కేసు విచారణ
- ప్రభుత్వ అఫిడవిట్‌కు కోర్టు ఆదేశం
- కీలకం కానున్న కోర్టు ఆదేశాలు

హైదరాబాద్, జూన్ 14 (నమస్తే తెలంగాణ): స్థానిక సంస్థల ఎన్నికలకు ఇప్పట్లో ముహూర్తం కుదిరేలా కనిపించటం లేదు. ప్రభుత్వం, ముఖ్యమంత్రి నుంచి ఎన్నికలపై ఎలాంటి స్పందన లేకపోవటంతో ఈ మధ్య ఎన్నికలు నిర్వహించటం కష్టమేనని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. కోర్టు జోక్యం చేసుకొని ఆదేశాలు ఇస్తే తప్ప ఎన్నికలు జరిగేలా లేవని అధికారులు చెప్తున్నారు. ఇప్పటికే గ్రామ పంచాయతీలకు పాలకవర్గాల సమయం ముగిసింది. వచ్చే నెలలో ఎంపీటీసీ సభ్యులు, ఎంపీపీ, జడ్పీటీసీ సభ్యుల, జడ్పీ చైర్మన్ల పదవీ కాలం ముగియనున్నది. ఈ నేపథ్యంలో వీటన్నింటికీ వరుసగా ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్నది. మొన్నటి వరకు ఎన్నికల కోడ్ ఉండటంతో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ సాధ్యం కాలేదు. కోడ్ ఎత్తేసి వారం గడిచినా కనీస స్థాయిలోనూ ఎన్నికలపై చర్చ జరగటం లేదని అధికారులు, రాజకీయ పార్టీలు చెప్తున్నాయి. స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించకపోతే నిధులు కూడా నిలిచిపోతాయని, అయినా రాష్ట్ర ప్రభుత్వంలో కదలికలేదని విమర్శిస్తున్నాయి. ఎన్నికల నిర్వహణకు సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లపై నిర్ణయం తీసుకోవాల్సి ఉన్నది. బీసీల రిజర్వేషన్‌పై సకాలంలో ప్రభుత్వాలు స్పందించకుంటే ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు కల్పించి మిగిలిన సీట్ల అన్నింటినీ జనరల్ క్యాటగిరీ సీట్లుగా పరిగణించి ఎన్నికలు నిర్వహించాలని గతంలోనే సుప్రీంకోర్టు ఘాటుగా స్పందించింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ నిర్ణయం ఎలా ఉంటుందన్నది ఆసక్తికరంగా మారింది. సీఎం ఆదేశాల కోసం బీసీ కమిషన్, పంచాయతీరాజ్‌శాఖ, ఎన్నికల కమిషన్ అధికారులు ఎదురుచూస్తున్నారు. ఇటీవల ఓ మంత్రి స్థానిక సంస్థల ఎన్నికల గురించి సీఎంను అడిగినా చూద్దాం అని పొడిపొడి సమాధానం వచ్చిందని కాంగ్రెస్ పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. మరోవైపు.. సర్పంచ్‌లు లేక గ్రామ పంచాయతీల్లో పాలక పడకేసింది. స్పెషల్ ఆఫీసర్లతో పాలన సాగిస్తున్నారు. ఆర్థిక భారం తాము మోయలేమని పంచాయతీ కార్యదర్శులు చేతులెత్తేశారు. దీంతో ఎక్కడి సమస్యలు అక్కడే పేరుకుపోయాయి. పారిశుద్ధ్యం, మౌలిక సదుపాయాల పనులు ముందుకు సాగటం లేదు.

కోర్టు తీర్పుపై ఉత్కంఠ

స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ ఇప్పటికే పలువురు వ్యక్తులు, సంఘాలు, అసోసియేషన్లు కోర్టు మెట్లెక్కాయి. ఈ కేసు జనవరి నుంచి కొనసాగుతున్నది. ప్రభుత్వం సార్వత్రిక ఎన్నికలు, ఇతర కారణాలను చూపుతూ వాయిదా కోరుతూ వచ్చింది. స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రభుత్వం అఫిడవిట్ దాఖలు చేయాలని వేసవి సెలవులకు ముందే కోర్టు ఆదేశాలు జారీ చేసి, కేసును జూలై 2కు వాయిదా వేసింది. ఈ నేపథ్యంలో తిరిగి కేసు జూలై 2న కోర్టు ముందుకు రానున్నది. ప్రభుత్వ అఫిడవిట్, దానిపై కోర్టు జారీ చేసే ఆదేశాలపైనే ఎన్నికల నిర్వహణ ఆధారపడి ఉంటుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. మరోవైపు, ఎన్నికల నిర్వహణకు సిద్ధమని ఈసీ ఇప్పటికే అఫిడవిట్ దాఖలు చేసింది.

హైదరాబాద్‌లో యూసుఫ్‌గూడలో బస్సు దిగి కింద పడుతున్న మెహరీన్

బాలికను చిదిమేసిన ఆర్టీసీ బస్సు

- విద్యార్థిని పైనుంచి వెళ్లిన టైర్లు
- అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయిన బాలిక

వెంగళరావునగర్,జూన్ 14: హైదరాబాద్ నగరంలో ఓ ఆర్టీసీ బస్సు ఓ బాలిక నిండు జీవితాన్ని చిదిమేసింది. యూసుఫ్‌గూడ చెక్ పోస్ట్ వద్ద జరిగిన ఈ దుర్ఘటనలో ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థిని మెహరీన్ (16) మృతిచెందింది. బోరబండ సర్దార్‌నగర్‌కు చెందిన ఈమె తన అక్క జువేరియాతో కలిసి యూసుఫ్‌గూడ చెక్‌పోస్ట్ వద్ద ఉన్న మాస్టర్స్ జూనియర్ కాలేజీలో చదువుతున్నది. ఇద్దరూ కలిసి శుక్రవారం కాలేజీ నుంచి ఇంటికి వెళ్లేందుకు సమీపంలోని బస్టాప్ వద్దకు వెళ్లారు. అంతలో కేపీహెచ్‌బీ డిపోనకు చెందిన సి కింద్రాబాద్ నుంచి బోరబండ వెళ్లే 10వై రూట్ నంబర్ బస్సు వచ్చి ఆగింది. మెహరీన్ బస్సెక్కగా, జువేరియా ఎక్కలేదు. బస్సు ఆపాలని డ్రైవర్‌ను కోరినా వినిపించుకోకపోవడంతో మెహరీన్ బస్సు కిందికి దూకేయడంతో కిందపడింది. వెంటనే ఆమెపై నుంచి బస్సు ముందు, వెనుక టైర్లు వెళ్లడంతో వెంటనే అక్కడికక్కడే ప్రాణాలొదిలింది. చెల్లిని చూసి అక్క జువేరియా, తోటి స్నేహితులు గుండెలవిసేలా రోదించారు. డ్రైవర్ నిర్లక్ష్యమే తన చెల్లి ప్రాణాలు తీసిందని జువేరియా ఆరోపించింది. మధురానగర్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్‌రెడ్డి ప్రమాద స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

టీఎన్జీవో ప్రధాన కార్యదర్శిగా ముజీబ్ హుస్సేనీ

ఏకగ్రీవంగా ఎన్నుకొన్న సంఘం కార్యవర్గం

గన్‌పార్కులోని అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న టీఎన్జీవో కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్,ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ఎం ముజీబ్‌హుస్సేనీ తదితరులు.

హైదరాబాద్, సుల్తాన్‌బజార్ జూన్ 14 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం (టీఎన్జీవో) కేంద్ర ప్రధాన కార్యదర్శిగా ఎస్ఎం ముజీబ్ హుస్సేనీ ఎన్నికయ్యారు. ప్రస్తుతం హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్న ఆయనను శుక్రవారం హైదరాబాద్ నాంపల్లిలోని టీఎన్జీవోభవన్‌లో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముజీబ్ ప్రస్తుతం స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో ఉద్యోగిగా పనిచేస్తున్నారు. గతంలో టీఎన్జీవో కేంద్ర సంఘం ప్రచార కార్యదర్శిగా, నాలుగు పర్యాయాలు హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడిగా సుదీర్ఘకాలం సేవలందించారు. ఉద్యమ సమయంలో హైదరాబాద్‌లో తెలంగాణ ఉద్యమాన్ని ఉర్రూతలూగించారు. సకల జనుల సమ్మె విజయవంతం కావడంలో ఆయన కీలకపాత్రను పోషించారు. సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణలోను ముజీబ్ ముందంజలో ఉంటారు. ఎంఎన్‌జే, బసవతారకం క్యాన్సర్ దవాఖానల్లో నిర్విరామంగా అన్నదానాన్ని నిర్వహిస్తున్నారు. రక్తదాన శిబిరాలను నిర్వహించడమే కాకుండా ఎంతో మంది అనాథలకు అండగా ఉన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ఆయన సేవలను గుర్తించిన టీన్జీవో కేంద్ర కార్యవర్గం నూతన ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకొన్నది. ఈ సందర్భంగా కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్, అసోసియేట్ అధ్యక్షులు కస్తూరి వెంకట్, ముత్యాల సత్యనారాయణ గౌడ్ కోశాధికారి రామినేని శ్రీనివాస్‌రావు, కొండల్‌రెడ్డి, పలు జిల్లాల అధ్యక్షప్రధాన కార్యదర్శులు ముజీబ్‌ను ఘనంగా సన్మానించారు. అనంతరం గన్‌పార్క్ వరకు ర్యాలీగా వెళ్లి, అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. కేంద్రం సంఘం ఉపాధ్యక్షుడిగా పర్వతాలు, కార్యదర్శులుగా రాగి శ్రీనివాస్, జ్ఞానేశ్వర్ సింగ్, గూడ ప్రభాకర్, షఫీ అహ్మద్, కార్యవర్గ సభ్యురాలిగా గీతారాణిలకు నియామకపత్రాలు అందజేశారు.

పెండింగ్‌లో అనేక సమస్యలు : మారం జగదీశ్వర్

ఉద్యోగుల అనేక సమస్యలు ఇంకా ఆపరిష్కృతంగానే ఉన్నాయని టీఎన్జీవో కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్ తెలిపారు. ఉద్యోగుల బిల్లులు సహా నాలుగు డీఏలు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని వెల్లడించారు. నూతన జిల్లాలకు అనుగుణంగా క్యాడర్ స్ట్రెంత్ పెంచడం, ఈహెచ్ఎస్ స్కీం, జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ ఏర్పాటు, టీఎన్జీవో సంఘానికి స్థలాల కేటాయింపు, పీఆర్సీ నివేదికను త్వరగా అందజేసి, మెరుగైన ఫిట్‌మెంట్, వంటి అంశాలపై తీర్మానాలు చేశామని వివరించారు. ఏపీ నుంచి తెలంగాణకు వచ్చిన 144 మందిని విధుల్లోకి చేర్చుకోవాలని కోరారు. ఎన్నికల కోడ్ ముగియడంతో ఉద్యోగుల సమస్యలను పరిష్కరించి మన్ననలు పొందాలని విజ్ఞప్తి చేశారు.

ఉద్యోగుల సేవలో తరిస్తా : ముజీబ్ హుస్సేనీ

టీఎన్జీవో కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శిగా రాష్ట్రంలోని ఉద్యోగుల సేవలో తరిస్తానని, సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని ముజీబ్ హుస్సేనీ స్పష్టంచేశారు. త్వరలోనే జిల్లా స్థాయిలో ఉద్యోగుల సమస్యల పరిష్కార సభలను నిర్వహిస్తామని చెప్పారు. టీఎన్జీవో సొసైటీలోని 4,012 మంది సభ్యులకు ఇండ్లస్థలాలను కేటాయించాలని, ఉద్యోగుల బదిలీల్లో సీనియర్లకు ప్రధాన్యం ఇవ్వాలని, జీవో -317 సమస్యలను పరిష్కరించాలని, సీపీఎస్‌ను రద్దుచేయాలని, హెల్త్‌కార్డులను మంజూరుచేయాలని ముజీబ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రూపాయి ఖర్చు లేకుండా.. బస్సు ప్రయాణం

- విద్యార్థినులను చూస్తుంటే ఆనందంగా ఉంది
- ఎక్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పోస్ట్

హైదరాబాద్, జూన్ 14 (నమస్తే తెలంగాణ): మహిళల కోసం తాము అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకంతో విద్యార్థినులు ఆర్టీసీ బస్సులో ఉచితంగా ప్రయాణం చేయడం చూస్తుంటే సంతోషంగా ఉన్నదని సీఎం రేవంత్‌రెడ్డి ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. 'సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం, మగ్దుంపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న ఈ బాలికలను చూస్తుంటే ఆనందంగా ఉంది. ఊరికి కిలోమీటర్ దూరాన ఉన్న పాఠశాలకు రూపాయి ఖర్చు లేకుండా వెళ్లగలుగుతున్నారు. ప్రజాప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకం వల్ల మేం ఉచితంగా బస్సెక్కి స్కూలుకు వెళ్లగలుగుతున్నాం అని తమ చేతిలోని ఆధార్ కార్డులు చూపిస్తూ వాళ్లంతా సంతోషం వ్యక్తం చేస్తుంటే.. ఓ జర్నలిస్టు మిత్రుడు ఫొటో తీసి పంపారు' అంటూ సీఎం రేవంత్‌రెడ్డి ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

మా హయాంలోనే ఉచిత బస్సు

- ముఖ్యమంత్రి గొప్పలు చెప్పుకోవడం హాస్యాస్పదం
- రేవంత్‌రెడ్డికి మాజీ మంత్రి హరీశ్‌రావు కౌంటర్

హైదరాబాద్, జూన్ 14 (నమస్తే తెలంగాణ): విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణం బీఆర్ఎస్ ప్రభుత్వం హయాం నుంచే అమల్లో ఉన్నదని మాజీ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. 'మహాలక్ష్మి' పథకంతో బాలికలు రూపాయి ఖర్చు లేకుండా స్కూలుకు వెళ్తున్నారంటూ సీఎం రేవంత్‌రెడ్డి ఎక్స్‌లో పోస్ట్ చేయగా.. హరీశ్‌రావు కౌంటర్ ఇచ్చారు. 'కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత ప్రయాణ పథకం ద్వారానే బాలికలు పాఠశాలలకు వెళ్తున్నట్టు సీఎం గొప్పలు చెప్పడం హాస్యాస్పదం. విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాం నుంచే అమల్లో ఉన్నది. గత ప్రభుత్వ పథకాలను, పనులను కాంగ్రెస్ నేతలు తమ ఖాతాలో వేసుకోవడం శోచనీయం' అంటూ హరీశ్‌రావు ఎక్స్‌లో కౌంటర్ ఇచ్చారు.

ఏపీలో మంత్రులకు శాఖల కేటాయింపు

పవన్‌కల్యాణ్‌కు కీలకశాఖల అప్పగింత

హైదరాబాద్, జూన్ 14 (నమస్తే తెలంగాణ): ఆంధ్రప్రదేశ్‌లో కొత్త మంత్రులకు శుక్రవారం శాఖలు కేటాయించారు. లాఅండ్ ఆర్డర్, జీఏడీ, పబ్లిక్‌ఎంటర్‌ప్రైజెస్ శాఖలు సీఎం చంద్రబాబు వద్దే ఉండగా మిగతా 24 మందికి వివిధ శాఖలు కేటాయించారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు డిప్యూటీ సీఎంతో పాటు పంచాయతీరాజ్, తాగునీటి సరఫరా, గ్రామీణాభివృద్ధి, అడవులు, సైన్స్ అండ్ టెక్నాలజీ, పర్యావరణ శాఖలు అప్పగించారు. నారాలోకేశ్‌కు ఐటీ, మానవవనరుల శాఖను కేటాయించారు. నారాయణకు మున్సిపల్, పయ్యావుల కేశవ్‌కు ఆర్థిక, వంగలపూడి అనితకు హోం, అచ్చెన్నాయుడికి వ్యవసాయశాఖ కేటాయించారు. మిగతా 18మంది మంత్రులకు వివిధ శాఖలు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

2 వేల పోస్టులు బ్యాక్‌లాగ్!

మొదటిపేజీ తరువాయి...

ఎల్బీ స్టేడియం వేదికగా అలాట్‌మెంట్ ఆర్డర్లను అందజేసింది. దీనిపై 1:2 జాబితాలోని అభ్యర్థులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. రీలిక్విష్‌మెంట్ విధానాన్ని అమలు చేయాలని పలువురు అభ్యర్థులు కోర్టును సైతం ఆశ్రయించారు.

రిలింక్విష్‌మెంట్ విధానం అంటే..

రీలింక్విష్‌మెంట్ విధానం అంటే.. గురుకులాల్లోని పోస్టులకు ఎంపికైన అభ్యర్థులు నిర్ణీత కాలం వరకు ఉద్యోగాన్ని వదిలిపోబోమని, ఒకవేళ అదే జరిగితే ఆ ఉద్యోగాన్ని మెరిట్ జాబితాలో ఉన్న తర్వాతి అభ్యర్థికి ఇచ్చేందుకు అంగీకరిస్తూ ఒప్పందపత్రాన్ని అందజేయాల్సి ఉంటుంది. ఆ మేరకు అఫిడవిట్‌ను దాఖలు చేయాలి. ఫలితంగా ఏ ఒక్క పోస్టు కూడా బ్యాక్‌లాగ్‌కు వెళ్లే అవకాశం ఉండదు. కానీ ప్రస్తుతం ట్రిబ్ ఆ విధానాన్ని అమలు చేయకుండానే పోస్టుల భర్తీని చేపట్టడమే అసలు వివాదానికి తావిస్తున్నది. ఎన్నికల కోడ్ ముగిసిన నేపథ్యంలో ప్రస్తుతం పోస్టింగులు ఇచ్చేందుకు ఆయా సొసైటీలు కసరత్తు చేస్తుండటం అందుకు బలాన్ని చేకూరుస్తున్నది.

అభ్యర్థుల డిమాండ్‌పై సర్కారు మౌనం

ట్రిబ్ డిసెండింగ్ ఆర్డర్‌ను పాటించకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నామని, రీలింక్విష్‌మెంట్ విధానాన్ని అమలుచేస్తే బ్యాక్‌లాగ్ పోస్టులు ఏర్పడే అవకాశం ఉండబోవని 1:2 జాబితాలోని అభ్యర్థులు తమ గోడు వెళ్లబోసుకుంటున్నారు. రాజకీయాల కోసం తమ భవిత వ్యాన్ని ప్రభుత్వం పణంగా పెడుతున్నదని ప్రభుత్వంపై నిప్పులు చెరుగుతున్నారు. ఇదే విషయమై పలువురు గురుకుల అభ్యర్థులు గతంలో ఏకంగా సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి విన్నవించుకున్నారు. ఆ సమయంలోనే సమస్య పరిష్కారానికి మంత్రి పొన్నం నేతృత్వంలో సబ్‌కమిటీ వేస్తామని హామీ ఇచ్చారని, మూడు నెలలు గడిచినా ఆ ఊసే లేకుండా పోయిందని అభ్యర్థులు గుర్తుచేస్తున్నారు. రీలింక్విష్‌మెంట్ విధానం, రెండో జాబితాను ప్రకటించాలనే డిమాండ్‌పై ప్రభుత్వం మౌనం వహిస్తుండడం సైతం అభ్యర్థుల్లో అనేక అనుమానాలకు తావిస్తున్నది. ఇప్పటికైనా దీనిపై ప్రభుత్వం స్పందించి స్పష్టమైన ప్రకటన జారీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. లేదంటే ఆందోళనను ఉధృతం చేస్తామని అభ్యర్థులు హెచ్చరిస్తున్నారు.

బ్యాక్‌లాగ్ పోస్టులన్నీ కొత్త నోటిఫికేషన్ ద్వారానే..

ప్రస్తుత నియామకాల్లో మిగిలే పోస్టులన్నింటినీ తర్వాత కొత్త నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయాలనే యోచనలో ఉన్నట్టు తెలుస్తున్నదని విద్యావేత్తలు, పలువురు గురుకుల అభ్యర్థులు నొక్కి చెప్తున్నారు. ప్రస్తుతం నోటిఫై చేసిన 9,210 పోస్టుల్లో ఇప్పటివరకు 8,708 పోస్టుల ఎంపిక ఫలితాలను మాత్రమే విడుదల చేసింది. అందులో కూడా 8,304 పోస్టులనే ట్రిబ్ భర్తీ చేసింది. 404 పోస్టులకు అర్హులైన అభ్యర్థులు లేరని చెప్పి భర్తీ చేయలేదు. అదీగాక రీలింక్విష్‌మెంట్ విధానం లేకపోవడం, కామన్ పేపర్ పెట్టడం, డిసెండింగ్ ఆర్డర్‌ను అంటే పైనుంచి కిందికి వరుస క్రమంలో నింపకపోవడం వల్ల ప్రస్తుతం భర్తీ చేసిన పోస్టుల్లోనూ దాదాపు 1,500 నుంచి 2,000 పోస్టుల వరకు బ్యాక్‌లాగ్‌లో పడిపోయే అవకాశం ఉన్నది. దీనిని ఒకే అభ్యర్థి వివిధ క్యాడర్ పోస్టులకు ఎంపిక కావడమే కారణమని అభ్యర్థులు వివరిస్తున్నారు.

మంజూరై భర్తీకాని పోస్టులూ కొత్త నోటిఫికేషన్‌లోనే..

బ్యాక్‌లాగ్ పోస్టులతోపాటు గురుకులంలో మంజూరై భర్తీచేయని పోస్టులు కూడా ఉన్నాయి. వాస్తవంగా అన్ని గురుకులాల కోసం ప్రభుత్వం తొలుత 11,687 పోస్టులను మంజూరు చేసింది. అందులో 10,675 పోస్టులు బోధన సిబ్బంది కాగా, మిగిలినవి 1,012 బోధనేతర పోస్టులు ఉన్నాయి. బోధన సిబ్బంది పోస్టులను ట్రిబ్ ద్వారా డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ చేపట్టింది. మొత్తంగా 10,675 పోస్టులను భర్తీచేయాల్సి ఉండగా, అందులో తొలిదఫాగా 9,210 పోస్టుల భర్తీకి మాత్రమే ట్రిబ్ నోటిఫికేషన్ జారీ చేసింది. సర్వీస్ రూల్స్, న్యాయ వివాదాల్లో ఉన్న 1,465 పోస్టుల భర్తీని రెండో విడతలో చేపట్టాలని గతంలోనే నిర్ణయించింది. పెండింగ్‌లో ఉన్న ఈ 1,465 పోస్టులనూ బ్యాక్‌లాగ్ పోస్టులతో కలిపి కొత్త నోటిఫికేషన్ ద్వారానే భర్తీ చేసి తమ ఖాతాలో వేసుకోవాలనే యోచనలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నట్టు విద్యావేత్తలే చెప్తున్నారు. ట్రిబ్ సైతం నోటిఫికేషన్‌లోని పేరా 5(1)లో జీవో 81, 1997 ప్రకారం వెయిటింగ్ లిస్టు విధానం లేదని, భర్తీ కాని, అభ్యర్థులు జాయినింగ్ కాని ఖాళీలను క్యారిఫార్వర్డ్ చేసి రాబోయే నోటిఫికేషన్ ద్వారా నింపుతామని ఇప్పటికే ఒకసారి ప్రతికా ముఖంగానే తేల్చి చెప్పింది.

ప్రజావిశ్వాసం కోల్పోయిన కాంగ్రెస్ సర్కారు

బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్ చుగ్

హైదరాబాద్, జూన్ 14 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఐదు నెలల్లోనే ప్రజల్లో విశ్వసనీయతను కోల్పోయిందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్ చుగ్ విమర్శించారు. ఇటీవలి పార్లమెంట్ ఎన్నికల ఫలితాలే ఇందుకు నిదర్శనమని చెప్పారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ శుక్రవారం ఢిల్లీలో తరుణ్ చుగ్‌ను కలిశారు. ఈ సందర్భంగా లోక్‌సభ ఎన్నికల ఫలితాల అనంతరం రాష్ట్రంలో బీజేపీ పరిస్థితి, మరింత బలోపేతానికి చేపట్టాల్సిన అంశాలపై వారు చర్చించారు. ఈ సందర్భంగా తరుణ్‌చుగ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో ఉన్న నిరాశను ఈ ఎన్నికల ఫలితాలు ప్రతిబింబిస్తున్నాయని తెలిపారు. మరోవైపు తెలుగు రాష్ట్రాలకు చెందిన 2022 బ్యాచ్ ఐఏఎస్ అధికారులు బండి సంజయ్‌ని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీలు సీతారాంనాయక్, బీబీ పాటిల్, మాజీ ఎమ్మెల్యేలు సంకినేని వెంకటేశ్వరరావు, ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, మాజీ ఎమ్మెల్సీ ఎన్ రామచంద్రరావు, నేతలు ఆచారి, ఎన్వీ సుభాష్, వీరేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

హామీల ఊసేది?

బీజేపీ శాసనసభా పక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

హైదరాబాద్, జూన్ 14 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు అవుతున్నా హామీలు అమలు చేయడం లేదని బీజేపీ శాసనసభా పక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు. ఢిల్లీలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. మొదట డిసెంబర్ 9న అమలు చేస్తామన్నారని, తర్వాత వందరోజుల సమయం అడిగారని, ఇప్పుడు ఆరునెలలు కూడా దాటిపోయాయని గుర్తుచేశారు. అయినా హామీలు అమలుకు నోచుకోవడం లేదని ధ్వజమెత్తారు.